515.160 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇప్పటి వరకు రూ.1.31 కోట్లు విలువైన 515.160 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం చింతలపూడి తదితర ప్రాంతాల్లో పర్యటించామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 250 రైతు సేవా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో కనీస మద్దతు ధరకు విక్రయించేందుకు రైతులు సమీప రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. అక్కడి సిబ్బంది కళ్లాల వద్దకు వచ్చి రైతులు పండించిన ధాన్యాన్ని పరీక్షించి నిబంధనల ప్రకారం ఉంటే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తారన్నారు. రైసుమిల్లుకు తరలించిన 48 గంటల్లోపే రైతు బ్యాంకు ఖాతాలో ధాన్యం సొమ్ము జమయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు.

'స్మార్ట్'గా బిగింపు..!

- జోరుగా విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ
- రెండు జిల్లాల్లో 13.30 లక్షల విద్యుత్ కనెక్షన్లు
- ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 6 వేలు, పశ్చిమలో 2 వేలు వరకూ బిగింపు
- వ్యాపార దుకాణాలు, ఇళ్లకు సైతం అమరిక
- ఇక నుంచి ఆన్‌లైన్‌లో మీటర్ రీడింగ్.. భారీగా బిల్లులు వచ్చే అవకాశం
- రెండో దశలో ప్రీపెయిడ్ కనెక్షన్లుగా మార్పు చేసే వ్యూహం
- అప్పుడు వ్యతిరేకించిన టిడిపి.. ఇప్పుడు మాత్రం ముందుకు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి అధికారంలోకొచ్చాక అందుకు భిన్నంగా ముందుకు సాగుతోంది. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను వేగంగా సాగిస్తోంది. ఇప్పటికే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో స్మార్ట్ మీటర్ల అమరిక ప్రక్రియ వేగంగా సాగుతోంది. 2025 మార్చి నాటికి స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో మొత్తం ఆరు లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో కమర్షియల్ కనెక్షన్లు 54,600 ఉండగా, గృహ విద్యుత్ సర్వీసులు 4.57 లక్షలు, మిగిలినవి ఇతర కనెక్షన్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 7.30 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, కమర్షియల్ కనెక్షన్లు 55 వేలు వరకూ ఉండగా మిగిలినవి గృహ, ఇతర సర్వీసులు ఉన్నాయి. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపును రెండు జిల్లాల్లోనూ ప్రారంభించింది. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో ఆరు వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో రెండు వేల కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేశారు. ముందుగా వ్యాపార దుకాణాలకు మాత్రమే అంటూ ప్రారంభించి ఇళ్లకు సైతం బిగింపు ప్రక్రియను మొదలుపెట్టారు. దీనికోసం ప్రత్యేక బృందాలు సైతం పని చేస్తున్నాయి. స్మార్ట్ మీటర్ల బిగింపుతో వ్యాపారస్తులు, గృహ వినియోగదారులంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్ల బిగింపుతో పరిస్థితి ఎలా ఉంటుందోననే భయం అందరినీ వెంటాడుతోంది. స్మార్ట్ మీటర్ల అమరికకు సంబంధించిన వ్యవహారమంతా అదానీ కంపెనీకే ఇచ్చిన పరిస్థితి నెలకొంది.

ప్రీ పెయిడ్‌కు మార్చే వ్యూహంతో ముందుకు

ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల బిగింపు మాత్రమే చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వైసిపి ప్రభుత్వంలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపునకు ప్రణాళిక రచించారు. విశాఖపట్నంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యూహాత్మకంగా స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ చేపట్టింది. ప్రీపెయిడ్ మీటర్లను కాదని కేవలం స్మార్ట్‌మీటర్లు మాత్రమే బిగిస్తున్నట్లు చెబుతున్నారు. కొంతకాలం తర్వాత ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చే వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం బిగిస్తున్న మీటర్లతో ఇకనుంచి నేరుగా ఇంటికి వచ్చి విద్యుత్ మీటర్ రీడింగ్ నమోదు చేసి బిల్లు ఇచ్చే పరిస్థితి ఉండదు. కార్యాలయం నుంచే అధికారులు ఆన్‌లైన్‌లోనే జిల్లాలోని అన్ని కనెక్షన్లకు ఒకేసారి బిల్లును జనరేట్ చేసి ఫోన్లకు మెసేజ్ రూపంలో పంపిస్తారు. స్మార్ట్‌మీటర్లకు సెన్సార్ ఉంటుంది. దీంతో ఎన్ని యూనిట్లు వాడారో అధికారులకు ఆన్‌లైన్‌లోనే రీడింగ్ తెలుస్తుంది. ప్రీపెయిడ్ మీటర్లుగా మార్పు చేస్తే ఫోన్ రీఛార్జి మాదిరిగా ముందుగానే విద్యుత్ రీఛార్జి చేయించుకోవాల్సి ఉంటుంది. అదే జరిగితే జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. స్మార్ట్‌మీటర్ల బిగింపుతో విద్యుత్ రీడింగ్ తీసే ఎంతోమంది కార్మికులు ఉపాధి కోల్పోనున్నారు. అంతేకాకుండా స్మార్ట్ మీటర్ల కారణంగా విద్యుత్ బిల్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండనుంది. ఇప్పటికే విద్యుత్ బిల్లులు కట్టలేక జనం అల్లాడిపోతున్నారు. 300 యూనిట్లు దాటితే ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తున్నారు. స్మార్ట్ మీటర్ల కారణంగా బిల్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో ప్రభుత్వ పథకాలకు ఇబ్బందులు వచ్చే పరిస్థితి ఉందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇటీవల భీమవరం వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు అంగీకరిస్తేనే స్మార్ట్ మీటర్లు బిగిస్తామని చెప్పారు. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా సాగుతోంది. వినియోగదారుల అంగీకారంతో సంబంధం లేకుండానే విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ సాగుతోంది. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపుపై పశ్చిమగోదావరి జిల్లా విద్యుత్ శాఖ అధికారిని వివరణ కోరగా ఇప్పటి వరకూ జిల్లాలో రెండు వేల పైచిలుకు విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు బిగించినట్లు తెలిపారు. ఏలూరు జిల్లా విద్యుత్ శాఖాధికారులు ఆరు వేలు స్మార్ట్ మీటర్లు బిగించినట్లు వివరించారు.



ఏలూరులోని బుక్ షాపులో బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటర్

ఎన్నికల కోడ్ అమల్లోకి

- 11న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉపఎన్నిక నోటిఫికేషన్
- 5న పోలింగ్, 9న కౌంటింగ్
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిషిద్ధం
- జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఈ నెల 11న నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు తెలిపారు. 18వ తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 19న పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ 21వ తేదీతో ముగుస్తుందన్నారు. డిసెంబర్ ఐదో తేదీన పోలింగ్, తొమ్మిదో తేదీన కౌంటింగ్ జరగనుందన్నారు. 12వ తేదీతో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. కోడ్ అమల్లోకి రావడంతో పాత పనులు సాగించుకోవడానికి ఏ ఇబ్బందీ ఉండదని, కొత్త పనులకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయకూడదని అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారికంగా సమీక్షా సమావేశాలు సైతం నిర్వహించేందుకు వీలుండదన్నారు. జిల్లాలో మొత్తం 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆరో తేదీన ఓటర్ల తుదిజాబితా విడుదల కానుందని, ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 2,274 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారన్నారు. నామినేషన్ల ప్రక్రియ అంతా తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కేంద్రంగా జరుగుతుందని డిఆర్ఒ తెలిపారు.

పంటలను దున్నేసిన వారిపై చర్యలు తీసుకోండి

సిపిఎం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గిరిజనుల సాగులో ఉన్న భూముల్లో పంటలను దున్నేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు హెచ్చరించారు. మండలంలోని సిరివారిగూడెం గ్రామంలోని పలు సర్వే నెంబర్లలో కొన్ని సంవత్సరాలుగా కొంతమంది గిరిజనులు తమ సాగులో ఉన్న 14 ఎకరాల భూమిలో బొబ్బర పంట వేసుకుని సాగు చేసుకుంటున్నారు. ఆ భూముల్లో మంగళవారం ఉదయం కొంతమంది గిరిజనేతర అక్రమార్కులు పంట చేలో ఎవరూ లేని సమయంలో ట్రాక్టర్‌తో దున్నివేసినట్లు గిరిజనులు వాపోతున్నారు. విషయం తెలియగానే పంట భూముల్లోకి వెళ్లి చూడగా చేతికొచ్చిన పంట మొత్తం దున్నేసి ఉందని, తామేం చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై బాధిత రైతులతో కలిసి సిపిఎం నేతలు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఇన్‌ఛార్జి తహశీల్దార్ సందీప్ దృష్టికి ఘటనను తీసుకెళ్లారు. పంట చేలు దున్నమని తామెవరికీ ఎటువంటి ఆర్డర్ ఇవ్వలేదని చెప్పారు. దీనిపై సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు స్పందిస్తూ పంటను దున్ని పాడు చేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు, పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేశామని దుర్గారావు వివరించారు.



తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న బాధితులు, నేతలు

కనీస సౌకర్యాలు కొరవడినా స్పందనేది

పాలసానిపల్లి గురుకులం యాజమాన్య తీరుపై ఎంఎల్ఎ ధర్మరాజు ఆవేదన

సౌకర్యాల కల్పనపై మంత్రులతో చర్చిస్తానని విద్యార్థులకు హామీ

ప్రజాశక్తి - భీమడోలు

పాలసానిపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల (బాలికలు) పాఠశాల, జూనియర్ కళాశాలల్లో కనీస సౌకర్యాలు కొరవడ్డాయని, ఉన్నవి శిథిలమయ్యాయని, వాటికి మరమ్మతు చేసే విషయమై యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గురుకులాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గమనించి కలత చెందారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో, మంత్రులు, ఇతర బాధ్యులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఎంఎల్ఎ తొలుత పాఠశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ లర్పించారు. అనంతరం పాఠశాల సాంస్కృతిక బృందం ప్రదర్శనను తిలకించారు. విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న ఆవరణలోనే విద్యార్థులు భోజనాలు చేయడం గమనించారు. వారితోపాటు భోజనాల వద్ద కూర్చుని మాట్లాడారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇదే క్రమంలో పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్లో ప్రదర్శించిన నమూనాలను తిలకించారు. ప్రతిభ కనబరిచి, గుర్తింపు పొందిన ఇద్దరు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన వసతిగృహాలతోపాటు తరగతి గదులు, మరుగుదొడ్లు ఇతర అంశాల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. విద్యార్థులు చేసే భోజనాల నాణ్యత విషయం పక్కన పెడితే, వారు భోజనాలు చేసే ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం శోచనీయమన్నారు. స్టోర్‌రూమ్ ఇతర విషయాల కూడా బాగోలేదన్నారు. పాఠశాలలోని సుమారు 700 మంది విద్యార్థులను ఒకేసారి పంపడం వల్ల పదార్థాలు వారికి తక్కువగా చేరుతున్నాయని, సమస్య పరిష్కారానికి వారికి రెండు పర్యాయాలుగా భోజన విరామం ఇవ్వాలని సూచించారు. ఇదే క్రమంలో ఉపాధ్యాయులు 1990లో నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. వాటిని బాగు చేయడంతోపాటు తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు అదనపు రక్షిత నీటి ట్యాంకు నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనిపై ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై తాను ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. సంబంధిత మంత్రులు, అధికారులతో మాట్లాడతానన్నారు. విశాలమైన ఆవరణ ఉన్నందున ఉపాధ్యాయులు, విద్యార్థుల సంయుక్త భాగస్వామ్యంతో గార్డెనింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, కిచెన్ గార్డెన్ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు పత్తి మదన్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

నేటి నుంచి కైకరం, నారాయణపురంలో రాష్ట్రస్థాయి క్రీడలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉంగుటూరు మండలం కైకరం, నారాయణ పురంలో నిర్వహించనున్నారు. కైకరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, షార్ట్‌పుట్, నారాయణ పురంలోని చింతలపాటి బాపిరాజు క్రీడా మైదానంలో 100, 200 మీటర్లు పరుగుపందెం పోటీలు అండర్-14 బాల, బాలికల విభాగంలో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి సుమారు 600 మందికిపైగా క్రీడాకారులు రానున్నట్లు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అలివేలు మంగ చెప్పారు. క్రీడాకారులకు అల్పాహారం, భోజనవసతులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

ఎపి నిట్ అభివృద్ధికి కృషి చేస్తా

ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్) అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు తెలిపారు. ఛత్తీస్‌ఘఢ్‌లోని రాయపూర్ నిట్ డైరెక్టర్ రమణారావును ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం ఎపి నిట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యార్థుల భాగస్వామ్యం అత్యంత కీలకమైందన్నారు. ప్రజలకు మేలు చేసే విభిన్న పరిశోధనలు, ప్రాజెక్టులపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన సాగించేలా చర్యలు తీసుకోవడంతోపాటు వారికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ విద్యా సంస్థ పురోభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించి వారికి పలు సూచనలిచ్చారు. ప్రాంగణంలోని భవన సముదాయాలను పరిశీలించారు. ముందుగా నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి రమణారావుకు స్వాగతం పలకగా, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి ఫ్యాకల్టీ తరపున పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, పలువురు విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.



రమణారావుకు స్వాగతం పలుకుతున్న నిట్ యాజమాన్యం

ప్రచారంలో గోపీమూర్తి, నేతలు

యుటిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి మంగళవారం నరసాపురం పట్టణం, మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను, వైఎన్ కళాశాల, స్వర్ణాంధ్ర కళాశాలల్లో అధ్యాపకులను కలిశారు. రానున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యలు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, ప్రయివేటు టీచర్స్, ప్రభుత్వ రంగ ఉపాధ్యాయుల సమస్యలపై సూటిగా ప్రశ్నించేది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమేనన్నారు. తాను విద్యార్థి దశ నుండి ఎన్నో సమస్యల మీద పోరాడానని, ఉపాధ్యాయ ఉద్యమంలో పాల్గొంటూ ఉద్యోగులకు అండగా నిలిచానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, అధ్యక్షులు పి.విజయరామరాజు, జిల్లా కార్యదర్శి పి.కృష్ణకుమార్, మున్సిపల్ కన్వీనర్ ఎం.లక్ష్మీనారాయణ, ఎన్‌వి.సత్యనారాయణ, ఎస్.అజయ్‌కుమార్, ఎం.మాణిక్యాలరావు, చంద్రకుమార్, సిహెచ్.కృష్ణ మోహన్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని 104 సిబ్బంది వినతి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మూడు నెలలుగా తమకు వేతనాలు అందడం లేదని, ఇలాగైతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని 104 సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కోయిదాలో స్థానిక పిహెచ్‌సి డాక్టర్ ఎంకెఎన్.గణేష్‌కు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 104 అంబులెన్స్ సిబ్బంది, డ్రైవర్లు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. కుటుంబ అవసరాల కోసం అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒకు జిఒ నెం.7 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని అన్నారు. ఇతర సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మట్ట విజయ్, డ్రైవర్ అనిల్ పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న 104 సంఘం నేత

రైతులు కనీస మద్దతు ధర పొందాలి

ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి, ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రైతులను చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్ కోరారు. చింతలపూడి పట్టణంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వద్ద మంగళవారం రైతు సేవాకేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతు సేవా కేంద్రాల ఏర్పాటు జరిగాయని అన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో 45 రైతు సేవా కేంద్రాలు ప్రారంభించామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం రైతు భరోసా పేరు పెట్టి రైతులకు ఎటువంటి భరోసా ఇవ్వలేదని, రైతులను మోసం చేసిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గోనె సంచుల వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వంలో నాణ్యత ఉన్న గోనె సంచులు అందిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో రవాణా ఛార్జీలు రైతులు భరించేవాళ్లు, ఇప్పుడు ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించి లాభపడాలని, దళారులకు ధాన్యం విక్రయిస్తే మోసపోతారని రైతులకు సూచించారు. మధ్య దళారులకు ధాన్యం అమ్మి రైతులు నష్టపోవద్దని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలు వచ్చినప్పుడు సరైన సమయంలో ధాన్యం కొనుగోలు చేయలేదు, రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గత సంవత్సరం ధాన్యం కొనుగోలు చేసిన డబ్బులు ఈ మధ్యనే ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన రూ.1650 కోట్లు ప్రస్తుత కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం 48 గంటలలో రైతులకు చెల్లించాల్సిన ధాన్యం డబ్బులు తక్షణమే చెల్లిస్తుందని తెలిపారు. ఉంగుటూరు రైతులకు 24 గంటలలో ప్రభుత్వం డబ్బులు అందించిందని, రైతులకు ధాన్యం అమ్ముకోవటంలో స్వేచ్ఛ ఉంది, ఏ మిల్లు కావాలో ఎంచుకోవచ్చు, నచ్చిన మిల్లుకి ధాన్యం అమ్ముకోవచ్చని, రైతులు రవాణా చార్జీలు చెల్లించవలసిన అవసరం లేదని తెలియజేశారు. రైతులకు ట్రాక్టర్ ఉంటే వాటి ద్వారా మిల్లులకు పంపించుకోవచ్చని తెలిపారు. రవాణా చార్జీలు కూడా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. పండించిన ప్రతి ధాన్యపు గింజను కొంటామని, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ఎటువంటి పరిస్థితుల్లోనైనా రైతులు నష్టపోకూడదని, కౌలు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. రైతులు ఆనందంగా ఉండాలనేదే ప్రభుత్వ ఆశయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, మండల అధ్యక్షులు మాటూరి వెంకట్రామయ్య, జిల్లా వ్యవసాయ అధికారులు షేక్ హబీబాష, ఎడిఎ నాగకుమార్, ఎఒ మీనా కుమారి, మండల తహశీల్దార్ ప్రమద్వర, మండల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

మహిళా డాక్టర్ల రక్షణ బాధ్యత ఆసుపత్రి అధికారులదే

ఎఆర్ డిఎస్‌పి విజి.శ్రీహరి

ప్రజాశక్తి - ఏలూరు

ఆసుపత్రులలో పనిచేసే మహిళా డాక్టర్లు, ఆరోగ్య సంరక్షణ సహాయకులు, కార్మికులకు సురక్షితమైన పని వాతావరణాన్ని, రక్షణను కల్పించాల్సిన బాధ్యతను సంబంధిత ఆసుపత్రి ఉన్నతాధికారులు తీసుకోవాలని, అందుకు తగిన విధంగా రక్షణ ఏర్పాట్లు చేయాలని జిల్లా పోలీసు ఎఆర్ డిఎస్‌పి విజి.శ్రీహరి అన్నారు. ఆసుపత్రులలో మహిళా డాక్టర్లు, ఆరోగ్య సంరక్షణ సహాయకులు, కార్మికుల రక్షణ పరిశీలనకై నియమించిన కమిటీ సభ్యులు మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో భద్రతా ఆడిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీహరి మాట్లాడుతూ కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచార, హత్య ఘటన అనంతరం అటువంటి సంఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా 100 పడకలపైన గల ఆసుపత్రులలో మహిళా డాక్టర్లు, ఆరోగ్య సంరక్షణ సహాయకులు, కార్మికులకు ఏర్పాటుచేసిన రక్షణ చర్యలపై భద్రతా ఆడిట్ నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ వారు జిల్లా స్థాయి కమిటీని నియమించారన్నారు. ఈ కమిటీ సభ్యులు ఆసుపత్రులలో మహిళా డాక్టర్లు, ఆరోగ్య సంరక్షణ సహాయకులు, కార్మికులకు ఏర్పాటుచేసిన రక్షణ చర్యలపై భద్రతా ఆడిట్‌ని నిర్వహించి నివేదిక సమర్పిస్తారన్నారు. సదరు నివేదికను అనుసరించి, ఆయా ఆసుపత్రులలో రక్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నియమించిన ప్రయివేట్ రక్షణ సిబ్బందిని కలిసి వివరాలను, వారి సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలోనికి అనవసరంగా వచ్చే ఆకతాయిలను కనిపెట్టాలని, ముఖ్యంగా రాత్రి సమయాలలో ఆసుపత్రిలోకి వచ్చే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఆసుపత్రిలోకి ప్రవేశిస్తే వెంటనే ఆసుపత్రి ఉన్నతాధికారులకు లేదా 112 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయలని సిబ్బందికి సూచించారు. జిల్లా ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ షియాజీ, కమిటీ సభ్యులు డివిజినల్ పౌర సంబంధాధికారి సిహెచ్.దుర్గాప్రసాద్, డాక్టర్ పద్మజా రాణి, డాక్టర్ వి.శారద, డాక్టర్ షేక్ హాఫీజా పాల్గొన్నారు.

14న మండల సర్వసభ్య సమావేశం

టి.నరసాపురం : ఈనెల 14న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎంపిపి దారబోయిన లక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండలాభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రగతి నివేదిక ఉంటుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

కూటమి ప్రభుత్వం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ముందుందని తెలియజేయడానికి సీసీ రోడ్లు ప్రారంభించినట్లు టిడిపి మండల అధ్యక్షులు దేవినేని డలరామ్, సర్పంచి కొండేటి విజయలక్ష్మిలు పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రమైన ముసునూరు గ్రామంలో సీసీ రోడ్డుకు వారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ నక్క యోహాను, తెలుగు యువత కార్యదర్శి బాబి, టిడిపి గ్రామ అధ్యక్షులు పాకనాటి సీతారామాంజనేయులు, వార్డు మెంబర్లు ఎన్.రాంబాబు, వేల్పూరి శ్రీను హాజరయ్యారు.

ఆసన్నగూడెం-బాదరాల రోడ్డుకు మోక్షం

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్ పనిచేస్తున్నారని లింగపాలెం టిడిపి మండల అధ్యక్షులు గరిమళ్ల చలపతిరావు అన్నారు. లింగపాలెం మండలంలో ఆసన్నగూడెం నుంచి భాదరాల సీసీ రోడ్ల నిర్మాణం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా ఆసన్నగూడెం నుంచి బాధరాల వరకూ ఉన్న రోడ్డుకు ప్రభుత్వాలు మారినా, మంత్రులు మారినా, ఎంఎల్ఎలు మారినా రోడ్డుకు మాత్రం మోక్షం కలగలేదన్నారు. తరాలు మారినా రోడ్లకు మాత్రం వరాలు లేవు కానీ ముఖ్యంగా ఆసన్నగూడెం, పోలాసిగూడెం, బాధరాలలో ఉన్న ప్రజలు కష్టాలను గుర్తించి ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్ ఆసన్నగూడెం నుంచి బాధరాల వరకు సిమెంట్ రోడ్డుకు రూ.కోటి 80 లక్షలు శాంక్షన్ చేసి శంకుస్థాపన కూడా జరిగిందని తెలిపారు. బాధరాల సర్పంచి బొల్లినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ యువత అధ్యక్షులు నత్త నాగేంద్ర పాల్గొన్నారు.

26న బహుజన సేన ప్రథమ వార్షికోత్సవం

ఏలూరు సిటీ : బహుజన సేన ప్రథమ వార్షికోత్సవ ఆహ్వాన కరపత్రాలను ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి పవర్‌పేటలోని ఎంఎల్ఎ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బడేటి మాట్లాడుతూ ప్రజలందరికీ మంచి జరిగే ప్రతి కార్యక్రమానికి తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ ప్రజలు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో పైకి ఎదగాలనేదే తన ఆకాంక్ష అని తెలియజేశారు. అనంతరం సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మత్తే బాబి మాట్లాడుతూ ఈనెల 26న బహుజన సేన ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకుని ఎంఎల్ఎ చేతుల మీదుగా వృద్ధులకు చీరలు, దుప్పట్లు, వికలాంగులకు వస్త్రదానం చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బహుజనులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బొద్దాని శ్రీనివాస్, మత్తే కుమార్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

నూజివీడు టౌన్ : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠినచర్యలు తప్పవని నూజివీడు టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్య శ్రీనివాసరావు అన్నారు. నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్.ప్రసాద్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి నూజివీడు టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్య శ్రీనివాసరావు, ఎస్ఐ జ్యోతిబసు, సిబ్బందితో నూజివీడు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గస్తీ నిర్వహించారు. బహిరంగ ప్రదేశంలో 18 మంది మద్యం సేవిస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని, వారిపై నూజివీడు టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ఉన్నవారి వివరాలు డయల్ 112కు గాని లేదా ఇన్‌స్పెక్టర్ ఫోన్ నెంబర్ 89779 17599కు సమాచారం తెలియజేసిన వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.

విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలి

ఏలూరు అర్బన్ : సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీల భారాలను తక్షణం రద్దు చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలతో వేల కోట్ల రూపాయల అదనపు భారాలను మోపడం దారుణమని విమర్శించారు. విద్యుత్ అదనపు ఛార్జీల భారాలను రద్దు చేయాలని, లేకుంటే భవిష్యత్తులో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండేటి బేబి, ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి వాటర్ వర్కర్ల జీతాలు చెల్లించాలి

యూనియన్ ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతి

ఏలూరు అర్బన్ : శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ మెయింటెనెన్స్ వర్కర్స్ జీతాలు వెంటనే చెల్లించాలని శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు డేగా ప్రభాకర్ మంగళవారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల ఏజెన్సీ మెట్టప్రాంత ప్రజలకు గోదావరి జలాలను మంచినీరుగా అందించడానికి భగవాన్ సత్యసాయి మంచినీటి పథకం వారి ట్రస్ట్ తరఫున ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం ఈ పథకం మెయింటెనెన్స్ బాధ్యతను ఎల్ అండ్ టి కంపెనీకి 2007లో అప్పగించారు. గత ప్రభుత్వం ఎల్ అండ్ టి వారికి ఈ పథకం నిర్వహణ బకాయిలు సరిగా చెల్లించకపోవడంతో 14 సంవత్సరాలుగా నడిపి, బాధ్యతల నుంచి వైదొలగారు. బిల్లులకు ప్రభుత్వంపై కోర్టుకెళ్లారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పురుషోత్తమ పట్టణం పంపింగ్ ద్వారా ఏజెన్సీ ప్రజలకు గోదావరి జలాలను మంచినీరుగా అందించే కార్మికులకు 14 నెలలుగా జీతాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్కీంలో పనిచేస్తున్న వారంతా పేదవారు, గిరిజన, దళిత పేద వర్గాలకు చెందిన కార్మికులు అని, ఈ స్కీంలో గత 17 సంవత్సరాలుగా పనిచేస్తున్నా స్కిల్డ్ జీతాలు ఇవ్వడం లేదని విమర్శించారు. రెక్కాడితే గాని డొక్కాడని రోజువారి వేతనంపై పనిచేసే వారి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

చింతలపూడి : చింతలపూడి పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.జానీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో ఉన్న ప్రధాన సమస్యలపై చింతలపూడి కమిషనర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి దినదిన అభివృద్ధి చెందుతుందని, పట్టణంలో అనేక షాపులు, యువతీయువకులు పనిచేస్తున్నారని అన్నారు. ఏ ఒక్క కాంప్లెక్స్‌లో కూడా టాయిలెట్స్, బాత్రూమ్స్ లేవని వీరంతా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చింతలపూడి పట్టణానికి చింతలపూడి టౌన్ నుంచే కాక మండల ప్రజలు, బోర్డర్ మండలాలైన చాట్రాయి, సత్తుపల్లి చుట్టుపక్కల ఉన్న అన్ని మండలాల నుండి వచ్చే ప్రజలు చింతలపూడి పట్టణంలో పబ్లిక్ టాయిలెట్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం చింతలపూడి పట్టణంలో పాత బస్టాండ్, గురుపట గూడెం రోడ్డు ఫైర్ స్టేషన్ సెంటర్లలో వీటిని ఏర్పాటు చేయాలని తెలిపారు. వినతిని అందించిన వారిలో సిపిఐ నాయకులు కంచర్ల గురవయ్య, తొర్లపాటి బాబు, ఎస్‌కె.కాలేశా, మోర్ల లక్ష్మణరావు, మల్లగిరి అల్లెగ్జాండర్, తాడిగడప మాణిక్యాలరావు, నర్సింగ్ రామారావు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ముదినేపల్లి : మండలంలోని వైవాక గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు ఎలాంటి అనుమతులు లేకుండా అమ్ముతున్నారనే సమాచారం మేరకు స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ వీరభద్రరావు తెలిపిన సమాచారం మేరకు వైవాక గ్రామ దివి బెల్ట్ షాప్‌పై రైడ్ చేసి అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిని పట్టుకున్నారు. వైవాక గ్రామానికి చెందిన యనమదల సుబ్రహ్మణ్యం, కర్రి సుబ్బారావు, కొత్తపల్లి సుబ్బులుగారలు పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.18,570 విలువ చేసే 120 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

చింతలపూడి : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ పి.అశోక్ అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం గస్తీ నిర్వహిస్తుండగా తిమ్మిరెడ్డిపల్లి గ్రామ వద్ద అనాకారంగా మద్యం అమ్ముతున్న తాళం మాధవరావు వద్ద నుంచి అఫీసర్ ఛాయిస్ విస్కీ-8 బాటిల్స్ కలిగివుండి అవి 180 ఎంఎల్ పరిమాణం గల బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని అతనిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐలు ఆదినేబ్.నరసింహారావు, అబ్బుల్ ఖలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలోని దర్భగూడెం దాబా హోటల్ సమీపంలో మంగళవారం సాయంత్రం ఎస్ఐ వి.నవీన్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా జీలుగుమిల్లి నుంచి దర్భగూడెం వస్తున్న ఏడుకొండలు అనే వ్యక్తి ని తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అతని వద్ద ఉన్న సంచిలో 14 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

శ్మశాన వాటిక ఏర్పాటు చేయరూ..!

ఖననానికి పర్వతాపురం దళితుల అవస్థలు
సమస్యను పరిష్కరించాలని వేడుకోలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పర్వతాపురం గ్రామంలో శ్మశాన స్థలం లేక 80 కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈమధ్యకాలంలో కల్లేపల్లి భాగ్యమ్మ, కల్లేపల్లి వెంకటేశ్వరరావు(తాటాకులు) అనారోగ్యంతో మృతిచెందారు. మరణించిన వాళ్లని సొంత భూములు ఉన్నవాళ్లు సొంత స్థలంలో దహన కార్యక్రమాలు చేస్తున్నారు. సొంత స్థలాలు లేని వాళ్లు చెరువుల ముందు దహన కార్యక్రమాలు చేస్తూ కాలం గడుపుతున్నారు. వర్షాకాలంలో మరీ దారుణంగా ఇబ్బంది పడుతున్నారు. వరి పొలాల్లో నుంచి దమ్ము చేసిన, నాటు వేసిన, పంటకు వచ్చిన, ఏ రీతిలో ఉన్నా శ్మశానం లేకపోవడంతో ఎవరి పొలంలో వారు శవాన్ని తీసుకువెళ్లి అంత్యక్రియలు చేసుకోవడానికి పంట పొలాలు తొక్కుకుంటూ మరీ తీసుకువెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వాలు మారినా దళితుల పరిస్థితులు ఏమాత్రం మారలేదు. ప్రతి దళిత వాడలో

వరి పొలాల్లో నుంచి ఖననానికి మోసుకెళ్తున్న శవం

కమ్యూనిటీ హాలు, శ్మశాన వాటిక ప్రభుత్వం కల్పించాలని ప్రతిపాదన చేయడం తప్ప ఆచరణకు నోచుకోని విధంగా దళిత వాడలు మండలంలో చాలా ఉన్నాయి. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో కమిటీ హాలు నిర్మిస్తాం, దళితులకు శ్మశాన వాటిక స్థలం కేటాయించి సౌకర్యాలు కల్పిస్తామని మాట ఇవ్వటం తప్ప ఎన్నికల అనంతరం పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారులకి చెప్పినా పట్టించుకోవటం లేదు. విఆర్ఒ సునీత, గతంలో ఉన్న తహశీల్దార్ విశ్వనాథ్‌కి ఆ సమస్యను స్పందన అర్జీలో కూడా పెట్టాం. ఇదిగో చూస్తాం, అదిగో చూస్తామని ఆయన కాలం గడిచేలా చేశారు. ఈ సమస్య ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు మారుతున్నా తీరడం తేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి పర్వతాపురం దళిత ఎస్‌సి కాలనీకి శ్మశాన స్థలం కల్పించాలని ఉన్నతాధికారులను, రాజకీయ నాయకులను, గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

రోడ్డు మరమ్మతు పనులకు ఆక్వా రైతుల సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని కొచ్చర్ల-వైవాక ఆర్ అండ్ బి రోడ్డు మరమ్మతుల పనులు చేసేందుకు ఆక్వారైతులు తమ వంతు ఆర్థిక సహకారం అందించారు. ఈ రోడ్డులో ఆక్వా చెరువుల పనులకు వెళ్లడానికి వ్యవసాయ కార్మికులు, చెరువు వద్దకు వెళ్లేందుకు రైతుల అగచాట్లు వర్ణనాతీతం. వైవాక వెళ్లడానికి ప్రధానమైన రహదారిగా కూడా ఎక్కువమంది ఈ రోడ్డును ఉపయోగిస్తారు. ఈ రోడ్డుపై కనీసం కారు, పొలాలకు వెళ్లడానికి ట్రాక్టర్ వెళ్లే పరిస్థితి లేదు. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఆక్వా రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. ఈ రోడ్డు కింద నుంచి అక్కడక్కడా గుంటలు ఉన్నాయి. ఆదమరిచినా అంతే గుంటలోకి వెళ్లి ప్రమాదం అయ్యే అవకాశాలు చాలా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొచ్చర్ల-పెదతుమ్మిడి ఆర్‌అండ్‌బి రోడ్డు బాగా దెబ్బతినడంతో ప్రజలు, రైతులు ప్రయాణం సాగించేందుకు నానా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామస్తులు కైకలూరు ఎంఎల్ఎ శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వైవాక ఆక్వా రైతులు రోడ్డు మరమ్మతులకు రూ.10 లక్షలు అందించేందుకు ముందుకు వచ్చి, రోడ్డు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రోడ్డు పనులకు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ ఇటీవల భూమి పూజ నిర్వహించారు. ఆక్వా రైతులు మాజీ దేవస్థాన ఛైర్మన్ అడ్డాల గణపతిరాజు, భగవాన్ రాజు, మోహన్ రాజు, సుబ్బరాజు, నరసింహరాజు, మాజీ సర్పంచి కొత్తపల్లి లక్ష్మీపతిరాజు, వెంకట సత్యనారాయణ రాజు, సూర్యనారాయణ రాజు, వేగిరాజు రామకృష్ణంరాజు, ముదుళ్ల శ్రీనివాసరాజు, మంతెన గణపతిరాజు, శ్రీనివాసరాజు, అల్లూరి శివాజీ రాజు, రామకృష్ణంరాజు, నాగుళ్ల రాఘవులు, శేషగిరి, ఇందుకూరు సోమరాజు, సూర్యరాజు, కూనపరాజు నాగరాజు, గొట్టుముక్కల సోమరాజు, మురళీ కృష్ణంరాజు, శ్రీనివాసరాజు, పుల్లంరాజు, ముదుండి శ్రీనివాసరాజు, వేగేశ్న సీతారామరాజు, భగవాన్ రాజు, మట్ట రాంబాబు, బొయిన శ్రీనివాసరావు, నున్న కనకరాజు, నడింపల్లి ధర్మరాజు, కనుమూరి రామకృష్ణంరాజు(జికెఎఫ్), కోసూరి సీతారామరాజు, గాధిరాజు రమేష్‌రాజు, పరాజ్ గొట్టుముక్కల ప్రసాదరాజు, పెన్మెత్స సత్యనారాయణరాజు, కలిదిండి సత్యనారాయణరాజు, చేకూరి చంటిరాజ్, కలిదిండి చిన రామరాజు, చింతల మురళీ, కూసంపూడి నాగరాజు, దాట్ల విజయరాఘవరాజు, కొత్తపల్లి లక్ష్మీపతిరాజు(పండు), సరిపల్లి శ్రీనివాసరాజ్, వేగేశ్న సూర్యరాజు తదితర ఆక్వారైతులు, ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడినాడ బాబు ఆధ్వర్యంలో తమ వంతు విరాళాలు అందించారు. వైవాక గ్రామ ఆక్వా రైతులు తమ సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతు పనులు చేసేందుకు ముందుకు రావడం పట్ల ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ వైవాక గ్రామ ఆక్వా రైతులందరినీ అభినందించారు. ఈ రోడ్డు మరమ్మతు పనులను ఆక్వా రైతులు స్వచ్ఛందంగా చేస్తుండడంతో కొచ్చర్ల, వైవాక గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రారంభమైన రోడ్డు మరమ్మతు పనులు

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు మైసాక్షి వెంకటాచారి ప్రభుత్వాన్ని కోరారు. కుక్కునూరు మండలంలోని పెదరావిగూడెం, శ్రీధరవెలేరు సచివాలయాల ఎదుట నాయకులు మంగళవారం ఆందోళన చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సచివాలయాల సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొన్నే లక్ష్మయ్య, మడిపల్లి రమణయ్య, శనగ శ్రీను, దాసరి వెంకట్రావ్, పళ్లాల భిక్షం పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా వీరకోటి

ప్రజాశక్తి - చాట్రాయి

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా వరుసగా మూడవసారి ఏకగ్రీవంగా వీరకోటి ఎన్నికయ్యారు. ఏలూరులో రెండు రోజుల పాటు జరిగిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభల్లో ఆయనను జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించడం కోసం కృషిచేస్తానని, అందుకు ఉపాధ్యాయులు తమ సహకారం అందించాలని కోరారు. వీరకోటి మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నికవ్వటం పట్ల యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణారావు, చీదిరాల రఘు, కోశాధికారి సత్యనారాయణరెడ్డి, గౌరవాధ్యక్షులు జరపలా చంటి, జిల్లా కౌన్సిలర్లు పాకాల రత్తయ్య, వి.పెద్ద రమేష్‌లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

నూజివీడు టౌన్ : బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఏలూరు నాగ ప్రభు కుమార్ ఆదేశాల మేరకు జరిపిన దాడులలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న ముసునూరు మండలం బలివే గ్రామానికి చెందిన చిల్లిముంత సీతారామయ్య తండ్రి లక్ష్మయ్య వద్ద 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ముసునూరు మండలం యల్లాపురం గ్రామానికి చెందిన వీరంకి నాగరాజు తండ్రి గోపయ్య వద్ద 50 మద్యం సీసాలను స్వాధీన పరుచుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడులలో ఎన్ఫోర్స్‌మెంట్ అఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వైవిఎస్ఎన్.ఫణి కుమార్, నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య, సిబ్బందితో పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధం : మంత్రి పార్థసారథి

ముసునూరు: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో రూ.31 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే విధంగా కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఆర్ అండ్ బి రహదారుల్లో గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేయడానికి, రాష్ట్ర వ్యాప్తంగా రూ.820 కోట్లతో ముఖ్యమంత్రి వెంటనే అమలు చేసే ఆరు పథకాలను పరిశీలించి, మొదటగా పేదలకు ఇచ్చే పెన్షన్ మూడు నెలల బకాయిలతో కలిపి, రూ.4 వేలు ప్రతి నెల ఒకటవ తేదీన అందజేస్తున్నామని అన్నారు. దీపావళి పండగ పురస్కరించుకొని మహిళలకు పెద్దపీట వేసే విధంగా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేసే కార్యక్రమం మొదటగా ప్రాముఖ్యత ఇచ్చి, వారికి సిలిండర్ తీసుకున్న 48 గంటల లోపు వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేసే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సర్పంచి గద్దల సుహాసిని మోహనరావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, సూర్యదేవర శ్రీనివాసరావు, మాజీ సర్పంచి శ్యామలరావు, గార్లపాటి నరసింహారావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించాలి

నూజివీడు టౌన్ : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో నూజివీడు కోనేరుపేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్యకార్యకర్తలకు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాప్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని అన్నారు. మాదకద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, అంతేకాక మనం నిత్యజీవితంలో చాలా మంది విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలై పోతున్నారన్నారు. సరైన అవగాహనతో మాదకద్రవ్యాలను కట్టడి చేయవచ్చు అని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక భాధ్యతగా తీసుకుంటే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమంలో కోనేరుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సూపర్ వైజర్ కుమారి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

7న మెడికల్ రిప్స్ చలో విజయవాడ

ఏలూరు అర్బన్ : ప్రజలకు అత్యవసర, నిత్యావసర మందులపై జిఎస్‌టిని ఎత్తివేయాలని, ఫార్మా రంగంలో పనిచేస్తున్న మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 7వ తేదీన విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఎపి సేల్స్ మెడికల్ రిప్రజెంటిటీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వివిఎన్.ప్రసాద్ తెలిపారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా రంగంలో సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అత్యవసర, నిత్యావసర మందుల ధరలు అందుబాటులో ఉండేలాగా మందులపై జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి అధ్యక్షులు బివి.సత్యనారాయణ, ఉమా మహేష్, వేణు పాల్గొన్నారు.

పేలుడు ఘటనలో బాధితులకు ఆర్థిక సాయం

ఏలూరు సిటీ : దీపావళి పండుగ రోజు ఏలూరు తూర్పువీధిలో జరిగిన అనుకోని దుర్ఘటనలో గాయాలపాలై బాధితులుగా మారిన ఆరుగురికి టిడిపి అండగా నిలిచిందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తూర్పువీధి పేలుడు ఘటనలో బాధితులకు పార్టీ ప్రకటించిన ఆర్థికసాయాన్ని ఎంఎల్ఎ అందించారు. బాధితులు గోపిశెట్టి సురేష్, కె.సత్యనారాయణ, కురుళ్ల శ్రీనివాస్, ఎస్‌కె.ఖాదర్, దేవరకొండ సతీష్, ఎండీ ఖాన్‌లు కొలుకున్న అనంతరం ఎంఎల్ఎ చంటిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికీ రూ.20 వేల ఆర్థిక సాయాన్ని ఎంఎల్ఎ చంటి అందించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ దీపావళి రోజు జరిగిన ఘటన అత్యంత బాధాకరమన్నారు. ఘటనలో గాయాలపాలైన వారికి టిడిపి అండగా నిలిచిందన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటూ, వారికి ఆర్థిక భరోసాను కూడా ప్రకటించిందన్నారు. అందులో భాగంగానే గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.20 వేల ఆర్థికసాయం అందించామని, అందులో ఒకరి కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించేందుకు కూడా ఆలోచన చేస్తామని ఎంఎల్ఎ చంటి భరోసా ఇచ్చారు.

రైతులు సేంద్రియ ఎరువులను వాడాలి

ముదినేపల్లి : మాట్లాడుతున్న ఎడిఎ వెంకటమణి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని జనార్ధనవరం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం వ్యవసాయ శాఖ అధికారి శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి రైతులతో మాట్లాడుతూ కాంప్లెక్స్ ఎరువులు వాడటం తగ్గించాలని, రైతులు సేంద్రియ ఎరువులను మాత్రమే వాడాలని, అవసరం మేరకు పురుగుమందులు వాడాలని, మొక్కల ఎదుగుదలకు కోడిగుడ్డు కషాయం వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదాసు చిన్న పుల్లయ్య, మాజీ సర్పంచి పలగాని దుర్గారావు, గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం : ప్రభుత్వం రాయితీపై రైతులకు బింధు సేద్యం పరికరాలు అందిస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సుమలత తెలిపారు. మంగళవారం మండలంలోని మక్కినవారిగూడెం, మర్రిగూడెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుంపర సేద్యం పరికరాలు అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలంలో అయిదు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సాగు సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వ్యవసాయాధికారి ఉషారాణి తెలిపారు. వ్యవసాయ శాఖ, దాని అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం అంబరుపేట గ్రామంలో నిర్వహించారు. ఇదే కార్యక్రమాన్ని మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆగడాల లంక గ్రామంలో చేపట్టారు. అంబరుపేట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి గ్రామ సర్పంచి వి.భాను దీపిక అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి ఉషారాణి మాట్లాడుతూ పొలసానిపల్లి, అంబరుపేట గ్రామపంచాయతీలలోని రైతు సేవా కేంద్రాల ద్వారా చేపట్టిన ధాన్యం కొనుగోలుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కోసం అంబరుపేట రైతు సేవా కేంద్రం వద్ద 20 వేల గోనెసంచులను సిద్ధం చేశామన్నారు. రైతులు ధాన్యాన్ని పంపేందుకు తమకు నచ్చిన మిల్లును ఎంపిక చేసుకునే అవకాశం ప్రస్తుత సీజన్ నుంచి ప్రభుత్వం కల్పించిందని తెలియజేశారు. కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలును లాంఛనంగా ప్రారంభించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు 17 శాతం తేమ నమోదైన ధాన్యాన్ని తరలించేందుకు అవసరమైన గోనెసంచుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. మట్టి, నీటి నాణ్యత, నారు నాణ్యతలను పరిశీలించేందుకు భీమడోలులో సమీకృత ఆక్వా పరిశోధనాశాల సేవలందించేందుకు సిద్ధంగా ఉందని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎం.రామ తులసి, భీమడోలు మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు పుల్లయ్య నాయుడు, భీమడోలు మత్స్యాభివృద్ధి అధికారి లీలా దుర్గ పాల్గొన్నారు.

ముదినేపల్లి : సార్వా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండవల్లి వ్యవసాయ శాఖ ఎడిఎ జి.వెంకట మణి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండలంలోని పెయ్యేరు, దాకరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన పొలం పిలుస్తోంది ద్వారా రైతుల అవగాహన కార్యక్రమానికి ఎడిఎ హాజరై రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కోతలు కోసే ముందు అపరాల పంటకు విత్తనాలు ఎంత అవసరమో రైతులు ముందుగా వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని రైతులను కోరారు. మండల వ్యవసాయ శాఖ అధికారి బి.వేణు మాధవ్, దాకరం సర్పంచి జాస్తి రాజా, పెయ్యేరు సర్పంచి అల్లు సుశీల, రెండు గ్రామాల రైతులు, గ్రామీణ వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మక్కినవారిగూడెం పంచాయతీ సర్పంచి మెతుకుమిల్లి గోపాలరావు అన్నారు. మక్కినవారిగూడెం సహకార సంఘం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎఒ సుమలతతో కలిసి మంగళవారం సర్పంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. మక్కినవారిగూడెం కేంద్రం పరిధిలో సుమారు 2,200ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందన్నారు. సాధారణ రకం రూ.2300, ఎ గ్రేడు రకం 2320లకు కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు. పిఎసిఎస్ కార్యదర్శి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిఇఒ వెంకటలక్ష్మి

ఏలూరు : జిల్లా విద్యాశాఖాధికారిగా నియమితులైన ఎం.వెంకటలక్ష్మి మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిఇఒ ఎం.వెంకటలక్ష్మికు అభినందనలు తెలియజేశారు.

విత్తన కంపెనీల మోసాలను అరికట్టాలి

ఆగిరిపల్లి: మొక్కజొన్న విత్తన కంపెనీల మోసాలను అరికట్టాలని, విత్తన రైతులకు కంపెనీల నుంచి అగ్రిమెంట్స్ ఇప్పించాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఆగిరిపల్లి యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన ఎపి రైతు సంఘం మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంఘం చేసిన ఆందోళన ఫలితంగా మొక్కజొన్న విత్తన రైతులకు విత్తన కంపెనీలు అగ్రిమెంట్స్ ఇవ్వాలని సబంధిత శాఖాధికారులు ప్రకటనలను ఇవ్వడం, సమావేశాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఘంటా పాపారావు, మండల కార్యదర్శి చాకిరి శివ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మండవల్లి: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న అంతర్గత రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎఇ కమలరాజు పేర్కొన్నారు. మండలంలోని పెరికే గూడెంలో పల్లె పండుగ నిధుల ద్వారా విడుదలైన నిధులతో నిర్మిస్తున్న రోడ్డును ఆయన సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తేదారులు రోడ్డు నిర్మాణంలో అన్ని నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

హమాలీల వేతన బకాయిలు ఇవ్వాలి

కుక్కునూరు : హమాలీల బకాయి వేతనాలు విడుదల చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో జిసిసి కార్యాలయం ఎదుట హమాలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ ప్రజలందరికీ ఆహార వస్తువులు అందించడానికి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా అహర్నిశలు కృషి చేస్తున్న జిసిసి హమాలీలకు గత మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా కుక్కునూరు ఎమ్ఎల్ఎస్ పాయింట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ధర్నాలో హమాలీలు తిరోజుల సురేష్, కడారి తిరపతయ్య, నెర్రబోయిన సాయిరాం, గరటం శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ : ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసే వారు అవి సరైన ధృవపత్రాలు కలిగినవా లేవా అన్న విషయాన్ని పూర్తిస్థాయిలో తెలుసుకుని మాత్రమే ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో ద్విచక్ర వాహన చోర్లకు మనం భూతమిచ్చినట్లు అవుతుందని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లాలోని కైకలూరు, ముదినేపల్లి, హనుమాన్ జంక్షన్‌లలో పలు కేసులు నమోదయ్యాయన్నారు. ఏలూరు రెండో పట్టణ పరిధిలో 16 కేసులు నమోదు అయ్యాయన్నారు. మొత్తంగా మూడు జిల్లాలలో 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటివిలువ రూ.17 లక్షల 50 వేలుగా పోలీసులు తెలుపుతున్నారు. అంతర్ రాష్ట్రాలలో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగలను ఈ కేసులో అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఈ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డిఎస్‌పి శ్రావణ్ కుమార్, సిఐలు వీరా రవికుమార్, ఐవి.రమణ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KALIPATNAPU VENKATA RATNAMALA**, W/o. Kalipatnapu Indu Sekhar Rao, Aged 71 years, Adhar No.3701 4944 6387, resident of D. No.24C-6-26, Chanikyapuri Colony, 1st Road, Ramachandraraopeta, Eluru- 534002, Eluru District, Andhra Pradesh, India hereby state as follows. My Name is **KALIPATNAPU VENKATA RATNAMALA**, W/o. Kalipatnapu Indu Sekhar Rao, and my name was wrongly mentioned in Passport as **KALIPATNAPU VENKATA RATNAM,** which was issued by Indian Passport Authorities. My name in passport shall be **KALIPATNAPU VENKATA RATNAMALA.** The name as mentioned above is true and correct. I will not change my name in future. If anything found contrary to the above statement, I will be liable for both civil and criminal actions.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S.No. 68/2022

అప్పిలెంట్: దూసనపూడి శ్రీదేవి

రెస్పాండెంట్లు: మైలవరపు సీతారామ్య వగైరా

పై నెంబరు ఎ.ఎస్.68/2022 అప్పీలులో రెస్పాండెంట్లు అయిన 1) మైలవరపు సీతారామయ్య, తండ్రి: లాలయ్య, డో.నెం.10-33-4ఎ/2, భాగ్యలక్ష్మీపేట, పాత 26వ వార్డు, తాడేపల్లిగూడెం, TPG XI ADJC, 5) మైలవరపు శశిరేఖ, తండ్రి: లేటు ఎం.ఎస్.నారాయణ, హౌస్ నెం.408, ఆర్.కె.రెసిడెన్సీ, మోతీ నగర్, హైదరాబాద్, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు అనువారికి అప్పీలు నోటీసులు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అమలు జరగనందున Substituted సర్వీసు ద్వారాను అమలు జరుపుటకు గాను **ది.19-11-2024వ సం॥రం తేదీకి వాయిదా వేసినారు. కావున 1,5 రెస్పాండెంట్లు సదరు వాయిదా రోజు ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టులో హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల 1,5 రెస్పాండెంట్లు పరోక్షమందు పై అప్పీలు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

S.RAMACHANDRA RAO
Advocate, Eluru.
Cell: